సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం : 26 : సెప్టెంబర్ : 2024



కరోనా కన్నా ప్రమాదం

అక్షరం వికటిస్తే కరోనా కన్నా ప్రమాదమని లోక కవి అందెశ్రీ అన్నారు.

వివరాలు 10లో ▸



ఆస్పత్రుల్లో తనిఖీ

ప్రభుత్వాస్పత్రుల్లో లోటుపాట్లను స్వయంగా పరిశీలిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.1 /21.8

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు చెంచులకు ఆధార్, కుల ధ్రువపత్రాల జారీ

మన్ననూర్: పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా **ఆదిమజాతి చెంచులకు పూర్తి** స్థాయిలో **ఆధార్ కార్డులు, కుల ధ్రువపత్రాలను అందజేసేందుకు గాను గురువారం** మన్ననూర్‌లో **ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తు**న్నట్లు ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా ధ్రువపత్రాలు అందజేస్తున్నప్పటికీ.. ఆశించిన స్థాయిలో ప్రక్రియ పూర్తి కావడం లేదన్నారు. ఈ క్రమంలో మన్ననూర్ రైతువేదిక వద్ద ఐటీడీఏ పీఓ రోహిత్‌రెడ్డి, అచ్చంపేట ఆర్డీఓ మాధవి సమక్షంలో చెంచులకు ఆధార్, కుల ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి



అచ్చంపేట రూరల్: డయల్ 100 ఫిర్యాదులపై పోలీసు సిబ్బంది తక్షణమే స్పందించాలని డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. బుధవారం అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలతో పాటు రిసెప్షన్, స్టేషన్ రైటర్, విశ్రాంతి గది, లాకప్ రూంలను పరిశీలించారు. ముందుగా పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ కారుతో నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. డీఎస్పీ వెంట ఎస్‌ఐలు రాము, ఇందిర, రైటర్లు అనిల్, బాల్‌రాం ఉన్నారు.

బాధ్యతగా పనిచేయాలి

అమ్రాబాద్: మంచినీటి సహాయకులు బాధ్యతగా పనిచేయాలని డీపీఓ రామ్మోహన్‌రావు అన్నారు. మండల కేంద్రంలో మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. వాటర్ క్లోరినేషన్, పైప్‌లైన్ లీకేజీలు, మోటార్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో డీఎల్‌పీఓ వెంకటప్రసాద్, ఎంపీడీఓ వెంకటయ్య, మిషన్ భగీరథ ఏఈ సందీప్, పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఉన్నారు.



సస్యశ్యామలం చేస్తాం

పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేస్తాం



కొల్లాపూర్ మండలం బోడబండతండా వద్ద హెడ్ రెగ్యులేటరీ పనులను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, అధికారులు

- సీఎం సొంత జిల్లాలోని ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నాం
- సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి నెలా సమీక్ష
- గత ప్రభుత్వం చేసింది 20శాతం పనులే
- ప్రాజెక్టుల సందర్శనలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తిచేసి, కరువు జిల్లాగా పేరున్న పాలమూరును సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలతో కలసి ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను బుధవారం సందర్శించారు. మొదటగా మహబూబ్‌నగర్ జిల్లా ఉదండాపూర్ రిజర్వాయర్, జోగుళాంబ గద్వాల జిల్లాలోని గట్టు రిజర్వాయర్, వనపర్తి జిల్లాలోని శంకరసముద్రం రిజర్వాయర్, నాగర్‌కర్నూల్ జిల్లాలోని కేఎల్‌ఐ పంప్‌హౌజ్ ఔట్‌లెట్, పాలమూరు ఎత్తిపోతల అప్రోచ్ కెనాల్, హెడ్ రెగ్యులేటరీలను పరిశీలించారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో కేఎల్‌ఐ మోటార్లను అధికారులు ప్రారంభించగా.. మెయిన్ కెనాల్ ద్వారా నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం సొంత జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. కరువు జిల్లాగా పేరొందిన జిల్లాలోని పాలమూరు–రంగారెడ్డి, కేఎల్‌ఐ, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, గట్టు ఫేజ్–2 ప్రాజెక్టులను వందశాతం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. ఇందుకోసం ఆర్థిక, నీటిపారుదల శాఖలను సమన్వయం చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్ట్ 90 శాతం పూర్తిచేశామని మూర్ఖంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలను మరమ్మతులు చేసి, వచ్చే వానాకాలం నాటికి పూర్తిస్థాయిలో నీటిని నింపనున్నట్లు తెలిపారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని 20 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యానికి పెంచే విషయంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్డీఎస్, మల్లమ్మకుంట సాగునీటి సమస్యకు త్వరలో పరిష్కారం చూపుతామని తెలిపారు.

ఎన్నికల కోసమే బీఆర్‌ఎస్ డ్రామా: మంత్రి జూపల్లి

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్ పనుల్లో కేవలం 20 శాతం మాత్రమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఒక మోటారు ఆన్ చేసి ప్రాజెక్ట్ ప్రారంభం చేశారని, ప్రాజెక్ట్ నీరు ఏమైందని ప్రశ్నించారు. ప్రాజెక్టు పూర్తిచేసేందుకు మొత్తం రూ.60 వేల కోట్ల దాకా అవసరం అవుతాయని చెప్పారు. మెయిన్ కెనాల్ నిర్మాణానికి భూసేకరణకే రూ.25వేల కోట్లు కావాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోని ప్రాజెక్టులను తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉందని చెప్పారు.

పెండింగ్ బడ్జెట్‌ను విడుదల చేయండి: ఎంపీ మల్లురవి

ఉదండాపూర్ రిజర్వాయర్‌కు సంబంధించి బడ్జెట్ పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేసి న్యాయం చేసే విధంగా నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి కోరారు. 21.21 ఎకరాల భూ సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.3.74 కోట్లను వెంటనే విడుదల చేయడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు సంబంధించి మరో 2.39 ఎకరాలకు అందాల్సిన రూ.2.63 కోట్లు, రిజర్వాయర్‌లోని నిర్మాణాలు, చెట్ల తొలగింపునకు రూ.13.74 కోట్లు విడుదల చేయాలన్నారు.

ఇంకా రూ.800 కోట్లు కావాలి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఉదండాపూర్ రిజర్వాయర్ ఆర్‌అండ్‌ఆర్‌కు మరో రూ.800 కోట్లు అవసరం అవుతాయని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చెప్పారు. నాలుగు తండాలకు రూ.45 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రభుత్వం విడుదల చేసినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కరివెన రిజర్వాయర్ పూర్తయితే 2.5 లక్షల ఎకరాలకు మాత్రమే నీరు అందుతుందని, అదే ఉదండాపూర్ రిజర్వాయర్ పూర్తయితే 9 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నిర్వాసితుల పక్షాన తానుంటానని, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ పెంచాలని తాము కోరుతున్నామని పేర్కొన్నారు.

అసహనం వ్యక్తం చేసిన గ్రామస్తులు

వనపర్తి జిల్లా కానాయపల్లిలో శంకరసముద్రం సందర్శనకు మంత్రులు వస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు తమ సమస్యలను చెప్పుకునేందుకు బుధవారం వ్యవసాయ పనులకు, కూలీ పనులకు వెళ్లకుండా వారి రాక కోసం ఎదురు చూశారు. కానీ మంత్రులు నేరుగా శంకరసముద్రం చూసేందుకు వెళ్లగా.. మంత్రులు తమతో మాట్లాడేలా చూడాలని గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు. పోలీసులు వారిని మంత్రుల వద్దకు వెళ్లనివ్వకుండా అడ్డుకోవడంతో గ్రామస్తులు తీవ్ర అసహనానికి గురయ్యారు.



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

వట్టెం పంపుహౌజ్ పరిశీలన లేకుండానే ముగిసిన పర్యటన

వట్టెం పంపుహౌజ్‌లోని ఐదు మోటార్లు ఇటీవల వరద నీటిలో మునిగిన విషయం తెలిసిందే. బుధవారం మంత్రుల సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ సందర్శన అనంతరం వట్టెం పంపుహౌజ్‌ను పరిశీలించాల్సి ఉంది. అయితే మంత్రుల పర్యటన షెడ్యూల్ సమయం కంటే ఆలస్యం కావడం, హెలికాప్టర్లో ప్రయాణించేందుకు గడువు సమీపించడంతో మంత్రులు వట్టెం పంపుహౌజ్‌ను పరిశీలించకుండానే నేరుగా నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. అక్కడే సాగునీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లా అధికారులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ బయలుదేరారు. ప్రాజెక్టుల సందర్శనలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఈఎన్సీ అనిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కలెక్టర్లు సంతోష్, విజయేంద్రబోయి, ఆదర్శ్‌సురభి, బీఎం సంతోష్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం



కోర్టు ఆవరణలో చీపురు పట్టి ఊడ్చుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు

కల్వకుర్తి/కల్వకుర్తి టౌన్: లోక్‌అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు అన్నారు. ఈ నెల 28న జాతీయ మెగా లోక్‌దాలత్ నిర్వహణపై బుధవారం కల్వకుర్తి సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నచిన్న కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే ఉత్తమమని అన్నారు. ఇరువర్గాల రాజీతో చాలా వరకు డబ్బు, సమయం ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నిర్వహించిన ఆరు లోక్‌అదాలత్‌లలో 39వేల కేసులను పరిష్కరించడం జరిగిందని.. రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కల్వకుర్తి కోర్టులో అత్యధిక కేసులు రాజీ కావడంపై జడ్జీలు, పోలీసులను అభినందించారు. ఈ నెల 28న నిర్వహించే లోక్‌అదాలత్‌లో 18వేల కేసుల వరకు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. కల్వకుర్తిలోని సీనియర్, జూనియర్ సివిల్ కోర్టులలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ఎంసీ, డీవీసీ, హెచ్‌ఎంటీపీ వంటి కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కోర్టు నూతన భవన నిర్మాణం త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కోర్టు భవన నిర్మాణ స్థలంలో ఉన్న చెట్ల తొలగింపుపై అటవీ శాఖ అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాల్గొని శ్రమదానం చేశారు. ప్రజలు స్వచ్ఛత పాటిస్తూ.. భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీదేవి, కావ్య, డీఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఇంజినీరు శివ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని డీఎంహెచ్‌ఓ డా.స్వరాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ప్రజారోగ్య సంరక్షణకు అవసరమైన మందుల తయారీ నుంచి వాటి నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడం.. వ్యాధిగ్రస్తులకు మంచి మందుల వినియోగంపై సూచనలు, సలహాలు ఇవ్వడం.. వాటి దుష్ఫలితాలపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు ముఖ్యభూమిక పోషిస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు వారు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, ఫార్మసిస్టులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.వెంకటదాస్, ప్రోగ్రాం అధికారులు డా.రవికుమార్ నాయక్ , డా.శ్రీనివాసులు, డా.లక్ష్మణ్, డా.కృష్ణమోహన్, ప్రభుత్వ ఫార్మసిస్టుల సంఘం అధ్యక్షుడు సురేష్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేష్, బాలరాజు, కుమార్, కుమారాచారి తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అడవుల సంరక్షణ

మన్ననూర్: అందరి సహకారంతోనే అడవులు, వన్యప్రాణులను సంరక్షణ సాధ్యమవుతుందని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి అన్నారు. మన్ననూర్‌లోని అటవీశాఖ ఈసీ సెంటర్‌లో బుధవారం అపోలో టోటల్ హెల్త్ ఆధ్వర్యంలో అచ్చంపేట డివిజన్ పరిధిలోని బేస్ క్యాంపుల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రథమ చికిత్స కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో డీఎఫ్‌ఓ మాట్లాడుతూ.. అడవులు, వన్యప్రాణుల అభివృద్ధి 1989లో ఏ విధంగా ఉన్నదో, ప్రస్తుతం అదే విధంగా అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. అందుకు చెంచు వాచర్లు, అటవీ సమీప గ్రామాలు, పెంటలకు చెందిన చెంచులు, గ్రామీణ ప్రజల సహకారం ఎంతగానో ఉందన్నారు. వణ్యప్రాణుల సంఖ్య పరంగా దేశంలోనే అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం ప్రథమ స్థానంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ క్రమంలో బేస్ క్యాంపుల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ దేవజ, డీఆర్‌ఓ రవికుమార్, అపోలో ప్రతినిధులు రాంబాబు, హరిత తదితరులు పాల్గొన్నారు.



బేస్ క్యాంపు సిబ్బంది, చెంచులకు ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేస్తున్న డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం



మాట్లాడుతున్న నాగరాజు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో పాలకుల తీరుతో విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి పేదకు విద్య నందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని, గురుకులాల్లో 600 మంది విద్యార్థులకు భోజనం అందేలా చూడాలని, 25 వేల అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న హైదరాబాద్‌లో విద్యార్థి గర్జన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రజినీకాంత్, సయ్యద్, తారాసింగ్, యాకూబ్, రాజేష్ ఉన్నారు.

టీచర్ల సర్దుబాటు దిశగా..

- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల తాత్కాలిక బదిలీలు
- పాఠశాలల వారీగా ఖాళీల ప్రకారం ప్రక్రియ
- కలెక్టర్‌కు పూర్తి అధికారం



అచ్చంపేట: జిల్లాలో విద్యార్థులు తక్కువగా ఉన్న చోట ఎక్కువ మంది.. ఎక్కువగా ఉన్న చోట తక్కువ మంది ఉపాధ్యాయులు కొనసాగుతున్నారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తయినా కొరత కారణంగా సగానికి పైగా రిలీవ్ కాని పరిస్థితి ఉంది. ఫలితంగా ప్రాథమిక విద్య కుంటుపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం టీచర్ల సర్దుబాటు దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను తాత్కాలికంగా సర్దుబాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ ఈ నెల 20న జిల్లా కలెక్టర్లు, డీఈఓలకు ఆదేశాలు జారీ చేసింది. అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌కు పూర్తి అధికారం కల్పించింది. ఈ మేరకు ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఏటేటా తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్..

యూడైస్ ప్లస్ లెక్కల ప్రకారం పభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఏటేటా తగ్గిపోతుందని స్పష్టమవుతోంది. అందుకు ఉపాధ్యాయులను అహేతుకంగా పాఠశాలలకు కేటాయించడమే కారణమని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో అభిప్రాయపడింది. రాష్ట్రస్థాయి ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి 1:17 కాగా.. ఇది విద్యాహక్కు చట్టం 1:30తో పోలిస్తే మెరుగ్గా ఉందని, అందుకే టీచర్లు ఎక్కువ మంది ఉన్న చోట నుంచి అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

71 పాఠశాలల్లో విద్యార్థులు నిల్..

జిల్లాలోని మారుమూల గ్రామాలు, తండాలు, చెంచుపెంటల్లో విద్యార్థుల సంఖ్య పెంపు ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా పడిపోతున్నట్లు యూడైస్ ప్లస్ డేటా స్పష్టం చేస్తోంది. జిల్లాలో 816 ప్రభుత్వ పాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా.. 199 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. 71 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్‌గా ఉంది. 101 పాఠశాలల్లో 1–10 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. 61 పాఠశాలలకు అసలు ఉపాధ్యాయులే లేరని విద్యాశాఖ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కాకపోవడం.. ఎంఈఓల కొరతతో పర్యవేక్షణ కొరవడటం.. తల్లిదండ్రులు ప్రైవేటు వైపు మొగ్గు చూపడం వంటి అంశాలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గుతున్నట్లు స్పష్టమవుతోంది.

మార్గదర్శకాలు ఇలా..

ఒకే గ్రామపంచాయతీ పరిధిలో ఉండే రెండు స్కూళ్లను విలీనం చేసే అధికారాన్ని జిల్లా యంత్రాంగానికి అప్పగించారు. ఒకే కాంప్లెక్స్‌లో రెండు స్కూళ్లు ఉంటే వాటిని విలీనం చేస్తారు. అక్కడ అవసరం లేకుంటే మండల పరిధిలోనూ, ఆ తర్వాత ఇతర మండలాలకు.. లేదంటే జిల్లా పరిధిలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తారు. ఒకే ఆవరణలో రెండు ప్రాథమిక పాఠశాలలు ఉంటే, ఒకటిగా పరిగణించి టీచర్లను సర్దుబాటు చేయనున్నారు. ఒకే చోట రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు లేదా ఒక పీఎస్, మరో యూపీఎస్ ఉన్నా ఒకటిగాను, రెండు హైస్కూల్స్ ఉంటే ఒక స్కూల్‌గా పరిగణిస్తారు. ఎంత మంది విద్యార్థులకు అంత మంది ఉపాధ్యాయులు ఉండేలా విద్యాశాఖ చర్యలు చేపడుతోంది.

జిల్లాలో పాఠశాలలు ఇలా..

పీఎస్	యూపీఎస్	జెడ్పీహెచ్‌ఎస్	విద్యార్థులు
560	125	131	48,887

మొత్తం ఉపాధ్యాయ పోస్టులు : 3,742	పనిచేస్తున్న ఉపాధ్యాయులు : 3,379
ఖాళీలు : 363	
జీరో ఎన్‌రోల్‌మెంట్ బడులు : 71	10 మంది విద్యార్థులు ఉన్నవి : 101
జీరో టీచర్లు ఉన్నవి : 61	
సింగిల్ టీచర్ల బడులు : 199	ఇద్దరు టీచర్లు ఉన్నవి : 183

విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఇలా..

విద్యార్థుల సంఖ్య	పాఠశాలలు
1-10	101
11-20	129
21-60	242
61-90	100
91-120	74

సర్దుబాటు ఉత్తర్వులు అసంబద్ధం..



ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటుకు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అసంబద్ధంగా ఉన్నాయి. తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేనప్పుడు నాణ్యమైన విద్య ఎలా అందించగలం. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి తగు నిర్ణయం తీసుకోవాలి.

– శ్రీధర్‌రావు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

అనుకూలత మేరకు..



రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, జిల్లాలో ఆయా పాఠశాలల అనుకూలత మేరకు సర్దుబాటు కార్యాచరణ ప్రకటిస్తాం. సమస్య తీవ్రంగా ఉన్నచోట మా పరిధి మేరకు పరిష్కరించాం. విద్యాశాఖ ఉత్తర్వుల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతుంది.

– గోవిందరాజులు, డీఈఓ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

భూత్పూర్: పట్టణంలోని మునిరంగస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం మసూల్‌పల్లికి చెందిన లక్ష్మి (35) నాలుగేళ్ల కిందట గ్రామం వదిలి వచ్చి భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. బుధవారం జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామని.. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

చిన్నచింతకుంట: విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన చిన్నచింతకుంట మండలం దాసర్‌పల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఆర్ శేఖర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరిజన్ లక్ష్మన్న(53) కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలో కార్మికుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం గ్రామంలోని శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ పొలంలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు చేసేందుకు వెళ్లి విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుత్ వైర్లకు విద్యుత్ సరఫరా ఉండడంతో విద్యుదాఘాతానికి గురై స్తంభం పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మన్నకు కుమారుడు ఉన్నాడు. సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పంచనామా నిర్వహించారు. పోస్టుమర్టానికి ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయన కుమారుడు కురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపాడు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్ బుధవారం వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రానికి చెందిన సాయిబాబా(25)కు నెలరోజుల క్రితం వివాహమైంది. కుటుంబంలో గొడవలు, భార్యతో వేధింపులు ఉండడంతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. సంఘటనకు సంబంధించి సాయిబాబా బావ శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

జడ్చర్ల: బోరు ఆన్ చేయడానికి వెళ్లి చెరువులో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధిలోని గోప్లాపూర్ బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వాటర్ మెన్ తోకల జంగయ్య(68) మిషన్ భగీరథ తాగు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామ శివారులోని చెరువులో ఉన్న బోర్లను ఆన్ చేసేందుకు సోమవారం రాత్రి అక్కడకు వెళ్లి గల్లంతయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం చెరువు నీటిలో మృతదేహం తేలడంతో బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. జంగయ్యకు భార్య నర్సమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

చౌక్కంపేట్‌లో విషాదఛాయలు

రాజాపూర్: మంగళవారం అర్ధరాత్రి ముదిరెడ్డిపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని చొక్కంపేట్ గ్రామానికి చెందిన బత్తుల వెంకటేష్‌గౌడ్(32) మహబూబ్‌నగర్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం సొంతూరుకు వెళ్లి రాత్రి తిరిగి వస్తుండగా ముదిరెడ్డిపల్లి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ద్విచక్రంపై ఉన్న వెంకటేష్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేష్ తండ్రి బత్తుల శేఖర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి ఈ విషయం తెలియడంతో బాధిత కుటుంబ సభ్యులు సానుభూతి తెలిపారు.

నిందితుడి అరెస్ట్

గద్వాల క్రైం: దేవాలయంలో చోరీకి పాల్పడిన సంఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం పట్టణంలోని వీరభద్రస్వామి దేవాలయంలో హుండీ ధ్వంసం చేసి రూ.1500లు అపహరించారు. నిందితుడు బుధవారం సాయంత్రం గద్వాల బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా కనిపించాడు. సీసీ కెమెరాల ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దేవాలయంలో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు పట్టణానికి చెందిన అమరేష్‌గా గుర్తించామన్నారు. నిందితుడి నుంచి రూ.250 నగదు స్వాధీనం చేసుకుని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కోయిల్‌సాగర్ జల పరవళ్లు

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు మళ్లీ జల పరవళ్లు తొక్కుతోంది. పెద్దవాగు నుంచి భారీగా వరద వస్తుండటంతో బుధవారం నాలుగు గేట్లను ఒక అడుగు మేర ఎత్తి 3 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో నీటిమట్టం 32.5 అడుగుల వద్ద ఉంచుతూ.. వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. - దేవరకద్ర



తెరుచుకున్న సైఫాన్లు

సరళాసాగర్‌కు వరద పోటెత్తడంతో సైఫాన్లు మళ్లీ తెరుచుకున్నాయి. బుధవారం ఉదయం 6 నుంచి 11 గంటల వరకు రెండు ఉడ్ సైఫాన్ల ద్వారా 6,400 క్యూసెక్కులు, రెండు ప్రైమరీ సైఫాన్ల ద్వార 1,000 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతోంది. మదనాపురం సమీపంలోని వంతెనపై వరద ఉధృతంగా పారడంతో కొత్తకోట, ఆత్మకూర్, అమరచింతలకు రాకపోకలు నిలిచిపోయాయి. - మదనాపురం



రామన్‌పాడుకు భారీగా వరద

రామన్‌పాడు జలాశయానికి సరళాసాగర్ నుంచి వరద పోటెత్తింది. అదేవిధంగా జూరాల ఎడమ కాల్వ ద్వారా 920, సమాంతర కాల్వతో 85 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో ఒక గేటును ఎత్తి 7వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఎన్టీఆర్ కాల్వకు 950, కుడి, ఎడమ కాల్వలకు 20, ఎత్తిపోతల పథకాలకు 107, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. - మదనాపురం

'ఉదండాపూర్' వద్ద ఉద్రిక్తత



ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద నిర్వాసితులను అడ్డుకుంటున్న పోలీసులు



ఎంపీ మల్లురవిని చుట్టుముట్టిన నిర్వాసితులు

- నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచాలని నిర్వాసితుల ఆందోళన
- మంత్రుల సభావేదిక వద్దకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద బుధవారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రిజర్వాయర్ సందర్శనకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తున్నారన్న సమాచారంతో ముంపు గ్రామాలైన వల్లూరు, ఉదండాపూర్, పలు తండాలకు చెందిన నిర్వాసితులు అక్కడికి వస్తుండగా.. పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. రిజర్వాయర్ వద్ద ఏర్పాటుచేసిన మంత్రుల సభావేదిక వద్దకు కొందరిని మాత్రమే అనుమతించారు. నిర్వాసితుల పక్షాన కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అయితే నిర్వాసితుల సమస్యలను మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించక పోవడంపై బీఆర్‌ఎస్‌కు చెందిన నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులకు సరైన హామీ ఇవ్వకపోగా.. తమ సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేయక పోవడం ఏమిటని మండిపడ్డారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచుతామని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటించగా.. ప్రభుత్వం మాత్రం గతంలో ఖరారు చేసిన రూ. 16.30 లక్షల ప్యాకేజీనే మంజూరు చేసిందన్నారు. అది కూడా కేవలం 180 మందికి మాత్రమే విడుదల చేశారన్నారు. అయితే అప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావు తదితరులు సభావేదిక నుంచి హెలీప్యాడ్ వద్దకు వెళ్లిపోయారు. తదుపరి ఎంపీ మల్లురవిని నిర్వాసితులు చుట్టుముట్టి, తమ సమస్యలను విన్నవించారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచాలి..



ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని రూ. 30 లక్షల వరకు పెంచాలి. ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో అన్ని ధరలు పెరిగాయి. మార్కెట్‌కు అనుగుణంగా ప్యాకేజీ పెంచి న్యాయం చేయాలి. తమ సమస్యలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌కు చెబుకుందామని వస్తే పోలీసులు అడ్డుకున్నారు.

– ఆంజనేయులు, నిర్వాసితుడు, ఉదండాపూర్

నష్టపరిహారం ఇవ్వలేదు..



ఉదండాపూర్ రిజర్వాయర్ పరిధిలో మాకు ఉన్న 4.10 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయం పైనే ఆధారపడే మా కుటుంబం జీవనోపాధి కోల్పోయింది. ఇప్పటి వరకు నష్టపరిహారం ఒక్క పైసా ఇవ్వలేదు. ఇప్పటికైనా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– చీకూరి ఆంజనేయులు, పోలేపల్లి

పరిహారం పెంపుపై హామీ ఏది?

ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం తక్కువ ధరలకు భూములను అప్పగించామని.. తదుపరి గత ప్రభుత్వం తమను ఎంతమాత్రం పట్టించుకోలేదని నిర్వాసితులు వాపోయారు. ఒకే రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్ పరిధిలోని భూములకు ఎకరా రూ. 5.50 లక్షల నుంచి రూ. 6.50 లక్షలు మాత్రమే పరిహారంగా ఇచ్చారని.. ఇదే రిజర్వాయర్ పరిధిలోని పోలేపల్లి శివారులో భూములకు మాత్రం ఎకరాకు రూ. 12 లక్షలు పరిహారంగా ఇచ్చారని తెలిపారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇచ్చిన మాదిరిగా తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ. 16 లక్షలు కాకుండా రూ. 30 లక్షలు ఇవ్వాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించే విధంగా స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉదండాపూర్‌లో బీఆర్‌ఎస్ అక్రమాల దందా

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్‌లో గత పాలనలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు అక్రమాలకు పాల్పడ్డారని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఉదండాపూర్ రిజర్వాయర్ వద్ద మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావుల పర్యటన ముగిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడుతూ నిర్వాసితుల ముసుగులో వారికి ఇచ్చే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కోసం 300 మంది బోగస్ కుటుంబాల పేర్లు నమోదు చేయించారని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ భూములకు తప్పుడు రికార్డులు సృష్టించి తమ పేర్లు నమోదు చేయించుకుని దొడ్డిదారిన పరిహారం తీసుకున్నారని, వారిని జైలుకు పంపడం ఖాయమన్నారు. భూమికి సంబంధం లేని ఇతర వ్యక్తుల ఖాతాలలోకి పరిహారాన్ని మళ్లించి స్వాహా చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క రూపాయి విడుదల చేయలేదని, రూ.45 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విడుదల చేయించిన ఘనత తమదేనన్నారు. రిజర్వాయర్ పరిధిలో అక్రమంగా ఫిల్టర్ ఇసుక తయారీదారులు, కాంట్రాక్టర్లను బెదిరించి కమీషన్లు వసూలు చేసుకునే వారు మాత్రమే నిర్వాసితులను రెచ్చగొడుతున్నారని అన్నారు. వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. నిర్వాసితులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ఆరు మాసాలలో అందజేస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్‌లో జరిగిన సమీక్షలో సంబందిత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు తమకు హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

పంటలను పరిశీలించిన పాలెం శాస్త్రవేత్తలు

ధరూరు: ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రఘునందన్‌ల ఆదేశానుల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత, పాలెం శాస్త్రవేత్తలు డాక్టర్లు ఎస్ నలిని, ఎం శంకర్, కే సైదయ్య, జీ ఈశ్వర్‌రెడ్డి, ఎం మల్లారెడ్డిలు మార్లబీడు, ర్యాలంపాడు, ధరూరులో పత్తి, వరి పంటలు పరిశీలించారు. ధరూరు శివారులోని పారుచర్ల స్టేజీ వద్ద ఎర్రబడిన పత్తి పంటను పరిశీలించారు. అధిక వర్షాల కారణంగా పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆముదం పంటను ఆశించిన దాసరి పురుగు నివారణకు ఇమామ్యాక్సిన్ మందును ఎకరానికి 20 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. అనంతరం ర్యాలంపాడులోని రైతు ప్రకాష్ సాగు చేసిన వరి పంటను పరిశీలించారు. వరిలో ఆకుముడతను గమనించిన శాస్త్రవేత్తలు దాని నివారణకు ప్రైరో మేషిన్ ఎకరానికి 200 మిల్లీ లీటర్ల మందును పిచికారీ చేయాలన్నారు. రసం పీల్చే పురుగు నివారణకు ఇముడాక్లోరోఫిల్ పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సంగీతలక్ష్మి, విస్తీర్ణ అధికారులు రంగారెడ్డి, రోహిత్, ఆంజనేయులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



ధరూరు శివారులో ఎర్రబడిన పత్తి పంటను పరిశీలిస్తున్న పాలెం శాస్త్రవేత్తలు

పోక్సో కేసు నమోదు

- ముగ్గురికి రిమాండ్

కేటీదొడ్డి: మైనర్‌ను లైంగిక వేధింపులకు గురిచేయడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్న కేసులో ముగ్గురు నిందితులపై పోక్సో కేసు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మండలంలోని 17 ఏళ్ల బాలికను మండలంలోని ఉమిత్యాల, నందిన్నె గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు లైంగికంగా వేధింపులకు పాల్పడ్డారు. దీంతో ఈ నెల 12న ఆమె పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 20న మృతి చెందింది. యువకుల లైంగిక వేధింపులే యువతి ఆత్మహత్య కారణమని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేయడంతో, నిందితులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కానిస్టేబుల్ అదృశ్యం

- నాలుగు బృందాలతో గాలింపు
- ఏఎస్పీ రామదాసు తేజావత్ వెల్లడి

వనపర్తి: జిల్లాలోని పాన్‌గల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రామకృష్ణ మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని అతడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు బుధవారం వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కానిస్టేబుల్ ఆచూకీని గుర్తించేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏఎస్పీ రామదాసు తేజావత్ వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. మదనాపురం మండలం కొన్నూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ రామకృష్ణ పాన్‌గల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ.. జిల్లా కేంద్రంలోని పోలీస్ క్వార్టర్స్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. మంగళవారం చివరగా ఎస్కార్ట్ విధులు నిర్వహించినట్లు పాన్‌గల్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో విధులు నిర్వర్తించలేకపోతున్నానని తన ఫోన్‌కు మెసేజ్ పంపించిన అతడు.. సెల్‌ఫోన్, ఇతర వస్తువులను ఇంట్లోనే ఉంచి వెళ్లిపోయినట్లు కానిస్టేబుల్ భార్య ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన కానిస్టేబుల్ కనిపించకుండా పోవడం స్థానికంగా కలకలం రేపింది. హైదరాబాద్ సహా ప్రధాన పట్టణాలతో పాటు అతడు ఎక్కడికి వెళ్లే అవకాశం ఉందని కుటుంబ సభ్యులతో తెలుసుకుని పోలీసు బృందాలను పంపించినట్లు ఏఎస్పీ తెలిపారు. కాగా, వనపర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కినట్లు కొందరు పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.

జూరాలకు 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

- 7 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 9 యూనిట్లలో విద్యుదుత్పత్తి



జూరాల వద్ద ఏడు క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో మరింత పెరిగింది. మంగళవారం సాయంత్రానికి 51వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. బుధవారం సాయంత్రానికి 72 వేల క్యూసెక్కులకు పెరినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు ఏడు క్రస్టు గేట్లను ఎత్తి 50,232 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 37,715 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఆవిరి రూపంలో 94, భీమా లిఫ్ట్–1కు 650, ఎడమ కాల్వకు 920, కుడి కాల్వకు 550, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 90,161 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 9.316 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

360,108 మి.యూ. విద్యుదుత్పత్తి

జూరాల ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో 9 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్లలో 196 మెగావాట్లు, 193.074 ఎంయూ, దిగువలో 4 యూనిట్ల ద్వారా 160 మెగావాట్లు, 167.034 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 360.108 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో 875.0 అడుగులకు నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయానికి 1,02,286 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం 875.0 అడుగుల వద్ద 163.5820 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి 35,315 క్యూసెక్కులు, ఏపీజెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తికి 13,919 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ.. సాగర్‌కు 49,234 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడుకు 15,000, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,410 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎంజీకేఎల్ఐకి నీటి విడుదల జరగలేదు. జలవిద్యుత్ కేంద్రంలో 13.723 మి.యూ. విద్యుదుత్పత్తి చేశారు. కుడిగట్టు కేంద్రంలో 2.107 మి.యూ ఉత్పత్తి చేశారు.

సుంకేసులలో మూడు గేట్లు ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల డ్యాంకు 15,882 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. మూడు గేట్లను ఎత్తి దిగువకు 13,437 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

బెదిరింపులకు పాల్పడిన కానిస్టేబుళ్ల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్ క్రైం: ఒంటరిగా ఉన్న జంటల ఫొటోలు తీసి బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లను సస్పెన్షన్ చేసినట్లు సీఐ కనకయ్య బుధవారం తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో ఓ వ్యక్తి తన స్నేహితురాలితో కలిసి కారులో ఉండగా.. అటుగా వచ్చిన బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ చెన్నయ్య వారిద్దరిని ఫొటోలు తీసి, రూ. 10 వేలు డిమాండ్ చేశారు. బాధితుడు తన వద్ద అంత డబ్బు లేదని.. రూ. 2వేలు ఉన్నాయని చెప్పడంతో కానిస్టేబుల్ తన స్నేహితుడి అకౌంట్‌కు పంపించాలని సూచించగా ఫోన్ ద్వారా పంపించారు. ఇదిలా ఉంటే, కానిస్టేబుల్ చెన్నయ్య తీసిన ఫొటోలను మరో కానిస్టేబుల్ రామచంద్రయ్యకు ఇవ్వగా.. అతడు కూడా బాధిత వ్యక్తులను బెదిరింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వార్తలు రావడంతో స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు.. విచారణ జరిపి ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌కు నివేదిక అందజేశారు. ఇద్దరు కానిస్టేబుళ్లపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో సస్పెన్షన్ వేటు వేసినట్లు సీఐ తెలిపారు.

సూక్ష్మధాతు లోపాలతో పత్తికి నష్టం



ఉండవల్లి మండలంలో సాగు చేసిన పత్తి పంట



మెగ్నీషియం లోపం ఉన్న పత్తి (ఫైల్)

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్ : పత్తిలో సూక్ష్మ ధాతు లోపంతో పంట పసుపు రంగులోకి మారి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. ముందస్తుగా చేపట్టాల్సిన నివారణ చర్యలను ఈ విధంగా వివరించారు.

జింకు లోపం..

జింకు లోపం మొక్క, ఆకుల మధ్య కనిపిస్తుంది. ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. కొమ్మ చివరి ఆకులు చిన్నవిగా ఉండి కణుపుల మధ్య దూరం తగ్గుతుంది. సేంద్రియ పదార్థం తక్కువైన నేలలో సున్నం పాలు లేదా భాస్వరం ఎక్కువగా ఉన్నా ఈ లోపం కనిపిస్తోంది. లోప నివారణకు ఆఖరి దుక్కిలో ఎకరాకు 20 కిలోలు జింక్ సల్ఫేట్ వేయాలి. లేదా పంట మీద జింకు లోప లక్షణాలు గుర్తించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను 5 లేదా 6 రోజుల వ్యవధిలో 2 నుంచి 3 సార్లు పిచికారీ చేయాలి.

బోరాన్..

ఈ పోషక లోపం వలన కొత్తగా పెరిగే చివరి మొగ్గలు దెబ్బ తింటాయి. మొగ్గల పెరుగుదల ఆగిపోయి పక్క మొగ్గల నుంచి అనేక కొమ్మలు వచ్చి మొక్క చివర గుబురుగా కనిపిస్తుంది. ఆకులు, కాండాలు, చివరి మొగ్గలు, రంగు, రూపాలు మారిపోయి అన్ని భాగాలు ముతకగా దళసరిగా, పెళుసుగా ఉండి కుళ్లిపోయినట్లు కనిపిస్తే అది బోరాన్ లోపం అని గుర్తించవచ్చు. బోరాన్ లోప నివారణకు పంట వేసిన 60 నుంచి 90 రోజుల తర్వాత లీటరు నీటికి 1 గ్రా బోరాక్స్ కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు సార్లు పిచికారీ చేస్తే తగ్గిపోతుంది.

మెగ్నీషియం..

మెగ్నీషియం పోషక లోపం ఉన్నప్పుడు ముదురు ఆకుల అంచులు నుంచి మధ్య భాగం పసుపు రంగులోకి మారి ఆకుల ఈనెలు మాత్రం ఆకు పచ్చగా ఉంటాయి. ఆకులు ఎండు బారి రాలిపోతాయి. ఈ లోపం పోటాషియం ఎక్కువగా ఉన్న నేలల్లో కనిపిస్తోంది. మెగ్నీషియం లోప నివారణకు లీటర్ నీటికి 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేటును పంట వేసిన 45 నుంచి 75 రోజుల తర్వాత రెండు సార్లు పిచికారీ చేయాలి.

27న తిరుమలకు మాజీ సీఎం వైఎస్ జగన్



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోనున్నా రు. ఈనెల 27 శుక్రవారం రాత్రికి ఆయన తిరుమల చేరుకుంటున్నారు. మరుసటి రోజు (28న), శనివారం ఉదయం ఆయన స్వామివారిని దర్శించుకుంటారు.

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు

సాక్షి, అమరావతి: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ఈ నెల 28న (శనివారం) ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. తిరుమల పవిత్రతను, వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం విశిష్టతను, స్వామి వారి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని అన్నారు. కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో శనివారంనాడు ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ, నీలిమ మెడికల్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రిజర్వేషన్లు కల్పించేంత వరకు మెడికల్ కౌన్సెలింగ్ ఆపాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ డిమాండ్ చేశారు. యూజీసీ చైర్మన్ మామిడాల జగదీశ్, కాళోజీ నారాయణ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కరుణాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వారిద్దరిని పదవుల నుంచి తొలగించాలని కోరారు.

బాబు కుట్రకు పోలీసు వత్తాసు

వేధించి తప్పుడు వాంగ్మూలాలు ఇప్పించే కుతంత్రం ● లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచార కుట్ర బెడిసికొట్టడంతో చంద్రబాబు పన్నాగం

- వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'
- సిట్ ఏర్పాటు తరువాత కూడా పోలీసులకు ఫిర్యాదు
- ముందు రోజు రాత్రే సీఐని వీఆర్‌కు పంపిన ప్రభుత్వం
- తమ అనుకూల అధికారిని నియమించిన తరువాతే ఫిర్యాదు
- ఇప్పటికే వీర విధేయులతో 'సిట్'.. తాజాగా పోలీసు అస్త్రం
- తమ కుట్రను ప్రశ్నిస్తున్న వారిని వేధించేందుకు చంద్రబాబు వ్యూహం
- నెయ్యిపై రాద్ధాంతం అంతా తమ అనుకూల డెయిరీలకు కాంట్రాక్టు ఇప్పించి తెర వెనుక హెరిటేజ్‌కు లబ్ధి చేకూర్చేందుకే

సాక్షి, అమరావతి: తిరుపతి లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారం బెడిసికొట్టడంతో సీఎం చంద్రబాబు కొత్త కుట్రకు తెర తీశారు. అవాస్తవ ఆరోపణల కుతంత్రం తన మెడకే చుట్టుకుంటుండంతో ఆయన ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకపోవడంతో ఆ వివాదమంతా టీడీపీ ప్రభుత్వ సృష్టేనని జాతీయ స్థాయిలో ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ అంశంపై మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి సుప్రీంకోర్టు తలుపు తట్టడంతో చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ అంశంపై న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుంటే తన కుట్ర బట్టబయలవుతుందని బెంబేలెత్తుతున్నారు. దీంతో తాను సృష్టించిన వివాదాన్ని తనకు అనుకూలంగా ముగించేందుకు చంద్రబాబు దారులు వెతుకుతున్నారు. అందులో భాగంగానే టీడీపీ వీర విధేయ పోలీసు అధికారులతో 'సిట్'ఏర్పాటు చేసినప్పటికీ ఆయన స్థిమితపడలేకపోతున్నారు. అందుకే లడ్డూ ప్రసాదం కోసం సరఫరా చేసిన నెయ్యిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో టీటీడీ అధికారులతో బుధవారం ఫిర్యాదు చేయించారు. పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తిమ్మిని బమ్మి చేసే కుతంత్రానికి పదును పెడుతున్నారు.

పక్కా పన్నాగంతోనే పోలీసులకు ఫిర్యాదు

లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూనే చంద్రబాబు ప్రభుత్వం పోలీసు అస్త్రాన్ని ప్రయోగించేందుకు సిద్ధ పడింది. కల్తీ నెయ్యి సరఫరా చేశారని గుర్తించామని చెబుతున్న రెండు నెలల తరువాత టీటీడీ తీరిగ్గా తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్‌లో తాజాగా ఫిర్యాదు చేయడం గమనార్హం. తమిళనాడుకు చెందిన నెయ్యి సరఫరాదారు ఏఆర్ డెయిరీపై టీటీడీ జనరల్ మేనేజర్ (స్టోర్స్) పి.మురళీకృష్ణ ద్వారా ప్రభుత్వం ఫిర్యాదు చేయించింది. నెయ్యి కల్తీ జరిగిందని జూలై 23నే టీటీడీకి నివేదిక వచ్చిందన్న చంద్రబాబు సెప్టెంబరు 20న తొలిసారిగా వెల్లడించి దుష్ప్రచారానికి తెరతీశారు. మరి కల్తీ జరిగిందని తెలిసిన జూలై 23నే ఆహార భద్రతా చట్టం కింద టీటీడీ ఎందుకు కేసు నమోదు చేయలేదన్న న్యాయ నిపుణుల ప్రశ్నకు ప్రభుత్వం సూటిగా సమాధానం చెప్పలేకపోయింది. టీటీడీ ఈవో శ్యామలరావు మొదట ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ నెయ్యిలో వెజిటబుల్ ఫ్యాట్ కలిసిందని... అయితే ఆ నెయ్యి వాడలేదని.. తిప్పి పంపామని వెల్లడించారు. అంతేగానీ జంతువుల కొవ్వు కలిసిందని ఆయన చెప్పలేదు. జంతువుల కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ నివేదికలో కూడా వెల్లడించలేదు. కానీ తరువాత ఈ నెల 20న సీఎం చంద్రబాబు కుట్రపూరితంగా నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందనే దుష్ప్రచారం మొదలు పెట్టడంతో శ్యామలరావు కూడా మాట మార్చక తప్పలేదు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలోని డొల్లతనంపై నిపుణులు సూటిగా ప్రశ్నలు సంధిస్తుండటంతో చంద్రబాబు బెంబేలెతున్నారు. దాంతో తమను ప్రశ్నిస్తున్న గొంతులను అణచివేసేందుకు పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలని నిర్ణయించారు. లడ్డూ ప్రసాదంపై దుష్ప్రచారాన్ని పతాకస్థాయికి చేర్చిన చంద్రబాబు బృందం తాజాగా తిరుపతి పోలీసులకు ఫిర్యాదు ముసుగులో వేధింపుల కుట్రకు తెర తీసింది.

హెరిటేజ్ కోసమే ఇదంతా..!

"టీటీడీకి సరఫరా అయ్యే నెయ్యిపై రాద్ధాంతం చేసి వివాదాన్ని సృష్టించడం ద్వారా తమకు అనుకూలంగా నడుచుకునే కొన్ని ప్రైవేట్ డెయిరీలతో కలసి సిండికేట్‌గా ఏర్పడి హెరిటేజ్‌కు అడ్డగోలుగా వ్యాపార ప్రయోజనాలు కల్పించాలని సీఎం చంద్రబాబు ఎత్తుగడ వేసినట్లు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు సైతం చర్చించుకోవడం గమనార్హం. ఏదో ఒక డెయిరీకి కాంట్రాక్టు ఇప్పించి తెర వెనక హెరిటేజ్ కార్యకలాపాలు సాగించేలా పథకం వేసినట్లు పేర్కొంటున్నారు"



- తిరుపతి ఈస్ట్ పోలీసులకు టీటీడీ బుధవారం ఫిర్యాదు చేసింది. అయితే ఆ ముందు రోజే అంటే మంగళవారం రాత్రే తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం హఠాత్తుగా వీఆర్‌కు పంపించింది. ఆయన స్థానంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న తమకు విధేయుడైన ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించింది. లడ్డూ అంశంపై అక్రమ కేసు నమోదు చేసేందుకు మహేశ్వర్‌రెడ్డి సుముఖత చూపలేదని సమాచారం. దాంతో ఆయన్ని తప్పించి తమకు విధేయుడైన అధికారిని నియమించినట్లు తెలుస్తోంది. పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసే ఫిర్యాదులపై విచారణ నిర్వహించాల్సిన బాధ్యత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌దే. టీడీపీ ప్రధాన కార్యాలయం చెప్పినట్లుగా దర్యాప్తు పేరిట వేధింపులకు పాల్పడే అధికారిని నియమించుకునేందుకే ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

మరి.. నాడు బాబు హయాంలోనూ కల్తీ జరిగిందా?

నెయ్యి కల్తీ జరిగినట్లు ప్రాథమిక ఆధారంగా టీటీడీ ఆ ఫిర్యాదులో ప్రస్తావించిన అంశం విడ్డూరంగా ఉంది. కేజీ నెయ్యి రూ.319.80 చొప్పున సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీ అంగీకరించడమే కల్తీ చేశారనేందుకు ప్రాథమిక ఆధారం అని పేర్కొనడం గమనార్హం. మరి కేజీ రూ.319.80 చొప్పున సరఫరా చేయడమే కల్తీ చేసినట్టుగా భావించాలంటే.. గతంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2015లో కేజీ రూ.276 చొప్పున, 2018లో రూ.320 చొప్పునే టీటీడీ నెయ్యి కొలుగోలు చేసింది. ఇక అప్పుడు కూడా కల్తీ చేసినట్లే భావించాలి కదా...? నాడు టీడీపీ హయాంలో నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై కూడా ఫిర్యాదు చేయాలి కదా? అని నిపుణులు నిలదీస్తున్నారు.

సిట్ వేశాక పోలీసులకు ఫిర్యాదా...!

లడ్డూ ప్రసాదం అంశంపై ప్రభుత్వం మంగళవారం తమకు వీర విధేయులైన పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) నియమించింది. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అక్రమాలకు కొమ్ము కాసిన గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని సిట్ ఇన్‌చార్జ్‌గా నియమించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఇక సిట్‌లో సభ్యుడిగా నియమించిన విశాఖపట్నం డీఐజీ గోపీనాథ్ జెట్టీ చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య అల్లుడు. రిటైరైన తరువాత హెరిటేజ్ ఫుడ్స్‌లో డైరెక్టర్‌గా పని చేసిన కృష్ణయ్య అనంతరం 2014–19లో టీడీపీ హయాంలో ఏపీఐఐసీ చైర్మన్‌గా ఉన్నారు. ఆయన్ని కూటమి ప్రభుత్వం తాజాగా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్‌గా నియమించింది. ఆయన అల్లుడు గోపీనాథ్ జెట్టీని సిట్ సభ్యుడిగా నియమించడం ద్వారా చంద్రబాబు కుతంత్రం బహిర్గతమవుతోంది. అయినా సరే చంద్రబాబులో ఆందోళన తగ్గలేదు. లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించాలని జాతీయ స్థాయిలో పార్టీలు, నిపుణులు, న్యాయవేత్తలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. సిట్టింగ్ న్యాయమూర్తి ద్వారా విచారణ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. తన వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంతో చంద్రబాబులో ఆందోళన మరింత తీవ్రమైంది. సుప్రీంకోర్టు విచారణకు ఆదేశిస్తే టీడీపీ సర్కారు కుట్ర మొత్తం బయటపడుతుందన్నది ఆయనకు తెలుసు. తమ కుట్రను కప్పిపుచ్చేందుకు సిట్‌తో సరిపెట్టలేమని భావించారు. అందుకే పోలీసు వేధింపులతో బెంబేలెత్తించి తనకు అనుకూలంగా లొంగదీసుకునే కుతంత్రానికి తెరతీశారు. తాజాగా తిరుపతి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం ద్వారా మరోవైపు నుంచి కూడా విచారణ పేరిట రాద్ధాంతం చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.

విచారణ పేరిట వేధింపుల కుట్ర..

రాజకీయ ప్రత్యర్థులు, డెయిరీల యాజమాన్యం, ఎంపిక చేసుకున్న అధికారులు, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడాలన్నదే చంద్రబాబు ప్రభుత్వం కుట్ర. అక్రమ కేసుల్లో ఇరికించి అనంతరం కొందర్ని అప్రూవర్‌గా మార్చుకుని తమ కుట్ర వాదనను వారితో ఒప్పించాలనే కుతంత్రం పన్నింది. సిట్ పూర్తి స్వరూపాన్ని ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. నివేదికతో సరిపెట్టాలా? అంతకుమించి అధికార పరిధి కల్పిస్తారా? అనేది స్పష్టం చేయలేదు. మరోవైపు తిరుపతి పోలీసులు కేసు విచారణ పేరిట వేధింపులకు గురి చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. అమరావతిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం డైరెక్షన్ మేరకే తిరుపతి పోలీసుల విచారణ హైడ్రామా కొనసాగనుంది. ఎవరెవరిని విచారణకు పిలవాలి..? ఎలా భయపెట్టాలి..? ఎలా వేధించాలన్నది అంతా టీడీపీ పర్యవేక్షణలోనే సాగనుందన్నది సుస్పష్టం. లడ్డూ ప్రసాదంపై తమ దుష్ప్రచారానికి వత్తాసు పలకాలని.. తప్పుడు వాంగ్మూలాలు ఇవ్వాలని... లేదంటే కేసుల్లో ఇరికించి అరెస్టులతో వేధిస్తామని పోలీసు అస్త్రాన్ని ప్రయోగించాలన్నది చంద్రబాబు కుతంత్రం అని స్పష్టమవుతోంది.



మహేశ్‌కుమార్ గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కుల గణన.. కాంగ్రెస్ పేటెంట్

- నాలుగైదు రోజుల్లో విధి విధానాలు పూర్తిచేస్తాం
- బీసీ సంఘాల విస్తృత స్థాయి సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సనత్‌నగర్ (హైదరాబాద్): కులగణన కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని, అది జరగనిదే స్థానిక సంస్థల ఎన్నికలు జరగవని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ల నియామకాల్లో కూడా నలుగురు బీసీలకు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీకి అవకాశం ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు చెప్పారు. 'సమగ్ర కుల గణన–బీసీ రిజర్వేషన్ల పెంపుపై'బీసీల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం బుధవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మాజీ ఎంపీ వి.హనుమంతరావుతో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కులగణన అంశాన్ని తెర మీదకు తీసుకువచ్చిన నేత రాహుల్ గాంధీ అన్నారు. ఎవరికి దక్కాల్సిన ఫలాలు వారికి అందాలనే ఉద్దేశంతో కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. నాలుగైదు రోజుల్లో కులగణనపై విధి విధానాలను ఖరారు చేసి ఆ దిశగా ముందుకు సాగుతామన్నారు. రాష్ట్ర ఖజానా అధ్వాన్న స్థితిలో ఉందని, నెలసరి ఆదాయం 18 వేల కోట్లు కాగా, గత ప్రభుత్వం చేసిన ఏడున్నర లక్షల కోట్ల అప్పులు తీర్చేందుకే ఎక్కువ శాతం ఆదాయం కేటాయిస్తూ వస్తున్నట్లు చెప్పారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అనవసర ప్రాజెక్టులతో దుబారా చేసి అప్పులపాలు చేసిందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ కులగణన అంశాన్ని లేవనెత్తగానే బీజేపీ కూడా స్వరం మార్చి ఆర్‌ఎస్‌ఎస్‌తో మద్దతు తెలియజేస్తోందన్నారు. బీజేపీ హయాంలో పెట్టుబడిదారులకు న్యాయం జరిగిందే తప్ప ప్రజలకు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నష్టాల్లో ఉన్న సంస్థలను ప్రైవేటీకరణ చేసిందే తప్ప లాభాల్లో ఉన్న వాటి జోలికి వెళ్లలేదని, నేడు బీజేపీ లాభాల్లో ఉన్న సంస్థలను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేస్తోందన్నారు. బీఆర్‌ఎస్ కూడా కులగణనకు మద్దతు అంటూ ఇప్పుడు చెబుతోందని, గత పదేళ్లు ఆ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు అనుగుణంగా కులగణన జరిపి తీరుతామని, ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు.

వనపర్తి వాసికి డీజీపీ ప్రశంసలు

- సిటిజన్ సర్వీస్‌లో రాష్ట్రంలోనే ప్రథమ స్థానం



వనపర్తి: సాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఉత్తమ సేవలు అందించడంలో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ సైబర్ క్రైం స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ఏసీపీ ఆర్‌జీ శివమారుతిని రాష్ట్ర పోలీస్ బాస్ జితేందర్ బుధవారం ప్రశంసించి ప్రత్యేక ధ్రువపత్రంతో సత్కరించారు. ఈయన వనపర్తి జిల్లా వాసి కావడం గమనార్హం. రాష్ట్రంలోనే ఉత్తమ సేవలు అందించిన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన శ్రీరంగాపురం మండలకేంద్రానికి చెందిన వ్యక్తిగా జిల్లా పోలీసులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్‌ఐగా తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన శివమారుతి 29 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ అంశాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న పోలీసుస్టేషన్లను గుర్తించడానికి పోలీసుశాఖ సిటిజన్ ఫీడ్ బ్యాక్ విధానం అవలంబిస్తోంది. జూలై, ఆగస్టులకు సంబంధించి బెస్ట్ సిటిజన్ సర్వీస్ కేటగిరిలో ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా టాప్‌వన్ ఠాణాగా హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎంపికై ంది. డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఏసీపీ శివమారుతిని కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు అభినందించారు.

పద్య రచన నైపుణ్యాలపై కార్యశాల

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలుగు పద్య రచన నైపుణ్యాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పద్య విశిష్టతపై ముఖ్య వక్త బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ, పద్య శిల్పంపై డా.మఠపతి మాంతయ్య, పద్య నిర్మాణ మెలకువలను అవధాని అవుసుల భాను ప్రకాశాచార్య, పద్య వైభవం గురించి పల్లెర్ల రామ్మోహన్ వివరించారు. అనంతరం విద్యార్థులతో పద్య రచన చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ డా.కృష్ణమూర్తి, అధ్యాపకులు డా.రాఘవేంద్ర, డా.సుభాషిణి, డా.స్వరూప, డా.స్వప్న, గోవర్ధన్, మారెప్ప, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అక్షరం వికటిస్తే కరోనా కన్నా ప్రమాదం



కవితా సంకలనం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవి అందెశ్రీ తదితరులు

- లోక కవి అందెశ్రీ

పాన్‌గల్: అక్షరానికి శక్తి ఉంటుందని.. పరిమితిగా వాడితేనే ఉపయోగమని, వికటిస్తే కరోనా కన్నా ప్రమాదమని తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, లోక కవి అందెశ్రీ అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో 'ఫ్లయింగ్ బర్డ్స్' విద్యార్థుల కవితా సంకలనం పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్య లేని వాడు తప్పులు చేయాలంటే లక్షసార్లు ఆలోచిస్తారని.. చదువుకున్న వారు క్షణం కూడా ఆలోచించరని వివరించారు. బడి అమ్మ ఒడి లాంటిదని.. కులమతాలు ఉండొద్దని సూచించారు. ఊరు బడులే మేధావులు, ప్రజాప్రతినిధులు, దేశ నాయకులను తయారు చేస్తాయన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని.. లక్ష్యానికి అనుగుణంగా చదివి కన్నవారు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చదువుతోనే సమాజంలో మార్పు, గౌరవం లభిస్తుందన్నారు. ఉపాధ్యాయులు కూడా ఇంటి గొడవలను పాఠశాలలో ప్రదర్శించకుండా విద్యార్థులతో కలిసి మెలిసి ఉంటూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ఆలోచనలకు అనుగుణంగా వారితో కవితాలు రాయించి పుస్తకం రూపంలో ప్రచురించిన ఉపాధ్యాయులు, పుస్తక సంపాదకులు కిరణ్‌కుమార్ ఆలోచన విధానం గొప్పదని.. అయనకు ప్రతి ఒక్కరు సంపూర్ణ మద్దతు ప్రకటించాలన్నారు. పశువుల దగ్గర, ఇసుక తిన్నల మీద శనివారం, ఆదివారం సెలవు రోజుల్లో విద్యార్థులే తనకు అక్షరాలు నేర్పించారని.. విద్యార్థులే తనకు ప్రథమ గురువులన్నారు. తాను రాసిన 'జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం' పాటను ఆనాడైనా.. రాష్ట్ర గీతంగా మారిన ఈనాడైనా దానిని నిలబెట్టింది, గుర్తింపునిచ్చింది, బతికించింది పిల్లలేనని, వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని తెలిపారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వారు తెలంగాణ జాతిని నిద్రపోనివ్వని పాటను అనుగ పెట్టారని.. వారికి గాలి, నేల, మట్టి సమాధానం ఇచ్చిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చి ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దాలని, కార్యాలయాలను తలదన్నే రీతిలో అభివృద్ధి చేయాలని మంత్రి జూపల్లికి కవి అందెశ్రీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరావు, ఎంపీఓ రఘురాములు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు, హెచ్‌ఎంలు నరేందర్, మంజుల, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అందెశ్రీని స్ఫూర్తిగా తీసుకోవాలి..

ప్రతి విద్యార్థి అందెశ్రీని స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలని ప్రజాకవి జనజ్వాల కోరారు. అక్షర జ్ఞానం లేకపోయినా.. ఆయన సాహిత్యం గొప్పదని, అపార జ్ఞానం ఉన్న గొప్ప కవి అని కొనియాడారు. ప్రతిభ ఉంటే గుర్తింపు వెదుక్కుంటూ వస్తుందని చెప్పడానికి అందెశ్రీ నిదర్శనం అన్నారు.

ఆస్పత్రుల్లో లోటుపాట్లపై తనిఖీ



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ డా.అజయ్‌కుమార్

- ఏరియా, సీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది నియామకం
- జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్

జడ్చర్ల టౌన్: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, రాష్ట్ర కార్యదర్శి ఆదేశాల మేరకు అన్ని ఆస్పత్రుల్లో సదుపాయాలు, లోటుపాట్లు ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్లు వైద్య విధాన పరిషత్ కమిషనర్ డా.అజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం జడ్చర్ల ఏరియా ఆస్పత్రిని పరిశీలించారు. ఆస్పత్రుల్లో సౌకర్యాలు, లోటుపాట్లపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. త్వరలోనే అన్ని ఆస్పత్రుల్లో క్యాడర్ స్ట్రెంత్ ప్రకారం వైద్యులు, సిబ్బంది నియమించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో వైద్యుల సంఖ్య, వారి సేవలపై ఆరా తీశారు. మందుల కొరత ఉందని, బయటకు రాస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో రోగులకు సరైన సౌకర్యాలు లేవని, వాటిని ఏర్పాటు చేయాలని ఆర్‌ఎంఓను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ కౌంటర్ మొదలుకుని చిన్నపిల్లల వార్డు, సాధారణ వార్డు, ప్రసవాల వార్డు, ఎమర్జెన్సీ వార్డులు తిరిగి పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో రోగులకు అందిస్తున్న సేవలు మరింత పెంచాలన్నారు. ఆస్పత్రిలో రెండు నెలలుగా ప్రసవాల సంఖ్య నామమాత్రంగా ఉండటంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సిజేరియన్‌ల సంఖ్య తగ్గించాలని సూచించారు. ప్రసవాల సంఖ్య పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు పెరుగుతుండటం, డెంగీ లక్షణాలతో వచ్చే వారి సంఖ్య పెరగటం వల్ల వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఆయన సందర్శనలో ఆర్‌ఎంఓ హరినాథ్, వైద్యులు అర్షదుల్లా, సూర్య, సత్యనారాయణ, పల్లవి, రవి, కిషోర్, రచితలు ఉన్నారు.

'శరన్నవరాత్రి ఉత్సవాలకు సీఎంను తీసుకొద్దాం'

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తీసుకొద్దామని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఉత్సవాల వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించాలని ఈఓను ఆదేశించారు. హైదరాబాద్‌లో కూడా పెద్దఎత్తున ప్రచారం చేపట్టాలన్నారు. ప్రభుత్వం తరఫున తాను అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తానని తెలిపారు. అనంతరం ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ మంత్రికి ఆహ్వాన పత్రిక అందజేశారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ

ఎగ్జిబిషన్లతోనే వైద్య విజ్ఞానం

పాలమూరు: ఎగ్జిబిషన్లతో విద్యార్థులకు మెడిసిన్‌పై అవగాహన, విజ్ఞానం పెరుగుతుందని డీఎంహెచ్‌ఓ డా. పద్మ అన్నారు. జిల్లాకేంద్రంలో ఎస్‌వీఎస్ వైద్య కళాశాల ఏర్పాటు చేసి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన మెడికల్ ఎక్స్‌పో–2024కు మంచి స్పందన లభిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి భారీగా విద్యార్థులు తరలివస్తున్నారు. మొత్తం 25 విభాగాల్లో 1,500 రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డా. పద్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద విద్యార్థులు మానవ శరీర భాగాల గురించి తెలుసుకోవడానికి చక్కటి అవకాశమన్నారు. గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోషి తదితరులు పాల్గొన్నారు.




స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డా. పద్మ

రేషన్ బియ్యం పట్టివేత

శాంతినగర్: అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి దాణాగా మార్చి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణ పరిధిలోని కోయిల్‌దిన్నె రోడ్డులోని ఓ పిండి గిర్నిలో అక్రమంగా రేషన్‌బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు 40 క్వింటాళ్ల నూకలు, 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. బియ్యం నిల్వ చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై శాంతినగర్ ఎస్‌ఐ సంతోష్‌ను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

పీయూ నాన్ టీచింగ్ సంఘం అధ్యక్షుడిగా రాంమోహన్



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూ నాన్ టీచింగ్ సంఘం అధ్యక్షుడిగా రాంమోహన్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఓ నం.60 ప్రకారం తమకు వేతనాలు ఇవ్వాలన్నారు. తనను ఎన్నుకున్న ఉద్యోగులందరికీ హృదయపూర్వక ధన్యావాదాలు తెలుపుతున్నానన్నారు.

ఆస్పత్రి నుంచి మహిళ అదృశ్యం

మహబూబ్‌నగర్ క్రైం: మానసిక సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ, ఆస్పత్రి నుంచి తప్పిపోయింది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. పెద్ద కొత్తపల్లికి చెందిన యాదమ్మ అనారోగ్య సమస్యలతో ఈనెల 22న పట్టణంలో ఉన్న హర్షసాయి సైకియాట్రిస్ట్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యింది. బుధవారం మధ్యాహ్నం సమయంలో యాదమ్మ ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఆమె తమ్ముడు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

టిప్పర్ ఢీ: వృద్ధుడి దుర్మరణం

మహబూబ్‌నగర్ క్రైం: బస్సు దిగి రోడ్డు దాటుతున్న వృద్ధుడిని టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హనుమాన్‌పురకు చెందిన చంద్రప్ప(67) బుధవారం ఉదయం మాచన్‌పల్లిలో అతని రెండో కూతురిని చూసేందుకు బస్సులో వెళ్లాడు. కోడూర్ స్టేజీ దగ్గర బస్సు దిగి రోడ్డు దాటుతున్న క్రమంలో టిప్పర్ వేగంగా ఢీకొట్టడంతో చంద్రప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కూతురు మొగులమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.